ఆరోగ్యవంతమైన సాగు

● పెరిగిన చిరు ధాన్యాల వినియోగం
● గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
● పుష్కలంగా పోషకాల లభ్యత



వి.కొత్తూరులో రాగి సాగు ప్రయోజనాలను వివరిస్తున్న అధికారులు



చామవరంలో సాగవుతున్న రాగి (చోడి) పంట

తుని రూరల్: ప్రస్తుత జీవన విధానంలో ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహిస్తుండడంతో చిరుధాన్యాలు, పప్పు ధాన్యాల వినియోగం గణనీయంగా పెరిగింది. రాగులు, జొన్నలు, చామలు, గంటిలు, కొర్రలు, పెసలు, మినుములు, కందులు, ఇతరేతర చిరుధాన్యాలపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో మార్కెట్ డిమాండ్ ఉండడంతో రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. దేశ విదేశాల్లో ఉన్న అవసరాలకు అనువుగా వీటి ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. జాతీయ ఆహార భద్రత మిషన్‌తో ఆరుతడిగా సాగయ్యే చిరుధాన్యాలు, అపరాల పంటలను ప్రోత్సహిస్తుంది. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అవసరమైన విత్తనాలను రైతులకు ఎన్‌ఎఫ్ఎస్ఎం ద్వారా సమకూర్చుతుంది. మరోపక్క సాంకేతిక, రసాయనిక పద్ధతులతో ఉత్పత్తి చేస్తున్న ధాన్యాలకు స్థానే సాంప్రదాయ పంటల వైపు రైతులను మళ్లించేందుకు వ్యవసాయ అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. క్రమంగా చిరు ధాన్యాలు ఉత్పత్తివైపు రైతులు మొగ్గు చూపేవిధంగా కార్యకలాపాలను రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రాంతాలను బట్టి ఆయా వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు 50 శాతం రాయితీపై విత్తన కిట్లను అందించారు.

ఆరుతడితో లాభాలు..

రోజు రోజుకు నిస్సారమవుతున్నసాగు భూములను పూర్వపు స్థితికి తీసుకురావడానికి అపరాలు ఎంతో మేలు చేస్తాయి. వేర్లు వాతావరణంలోని నత్రజనిని సంగ్రహించి వేరు బొడిపెలు ద్వారా నేలకు అందిస్తాయి. ఆకుల కాడలు కుళ్లి సేంద్రియ పదార్థంగా మారి రసాయనిక వాటి జీవ కార్యకలాపాలు జరుపుకొంటూ నేలను గుల్లపర్చి తేమను నిల్వ ఉంచుతుంది. పప్పు ధాన్య పంటలు పశువుల మేతగా ఉపయోగపడతాయి. ఈ పంటలు సాగుచేయడం ద్వారా కలుపు ఉధృతి తగ్గుతుంది. ఈ పంటలను సాగు చేయడం వల్ల నేల పైపొర మట్టి నీటి వరదకు కొట్టుకొని పోకుండా అరి ఉంటుంది. మాంసకృత్తులు, విటమిన్ ఎ దాదాపు 3-4 శాతం ఉంటుంది.

రెండు విధాలుగా సాగు

చిరుధాన్యాల సాగును రెండు విధాలుగా చేయొచ్చని అధికారులు వివరిస్తున్నారు. నేరుగా విత్తనాలు జల్లి పంట పొందడం, ముందుగా నారు వేసి తర్వాత నాట్లు వేసి పంట ఫలసాయాన్ని పొందే విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పొలాల్లోనే కాకుండ పొలం గట్లపైనా కంది సాగు చేయొచ్చని ఆ విధంగా అపరాలను సాగు చేస్తే అదనపు ఆదాయం పొందొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

1,962 మంది రైతుల గుర్తింపు

జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో రాగులు, మినుములు, కందులు సాగు చేసేందుకు 2025-26 సంవత్సారానికి 1,962 మంది రైతులను గుర్తించారు. రాగులు సాగుకు 25 మంది, మినుము సాగుకు 119 మంది, పొలాల్లోను, గట్లపై కందిసాగుకు 1,818 మంది రైతులను గుర్తించిన అధికారులు సాగుకు అవసరమైన సలహాలు సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. గుర్తించిన రైతులందరికీ ఇప్పటికే రాయితీ విత్తన మినీకిట్లను అందించారు. ఆసక్తిగల మరికొంత మంది రైతులు ఇతర చిరుధాన్యాల విత్తనాలను సమకూర్చుకుని సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలకు మెట్ట ప్రాంతం అనుకూలంగా ఉండడం, సాగునీటి లభ్యత కరువై ఇప్పటికీ ఖరీఫ్ వరినాట్లు వేయిన రైతులే లక్ష్యంగా అధికార యంత్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తుంది.

ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా 525 మందికి రాగి, మినుము మినీకిట్లు, 30 క్వింటాళ్ల కంది విత్తనాలను రాయితీపై అందించాం. ప్రభుత్వమే గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తుంది.

–చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, తుని.

క్లుప్తంగా

పోషకాల పై విద్యార్థులకు అవగాహన



మానవహారం నిర్వహించిన విద్యార్థులు

ప్రత్తిపాడు: విద్యార్థులకు పోషక విలువలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత అన్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీవన ఎరువులపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. అమృత మాట్లాడుతూ జీవన ఎరువులు, నానో యూరియా, రాగి మిల్లెట్, ఆహార పదార్థాల్లో పోషక విలువలు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జాన్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్వీ సూర్యనారాయణ, వెంకటరమణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యా వివాహం.. శాపం



బాల్య వివాహ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

శంఖవరం: బాల్య వివాహలను నిర్మూలించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మీ అన్నారు. స్థానిక కేజీబీవీలో బాల్య వివాహలపై గురువారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించడానికి రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందన్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిగితే బాల్య వివాహం నిర్మూలన చట్టం ప్రకారం 2 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు.

ముద్రగడ గిరిబాబు పరామర్శ



గౌరీకల్యాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని ధర్మవరం, ఒమ్మంగి, శరభవరం, బవురువాక గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు పర్యటించి ఇటీవల కాలంలో మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. పరామర్శల్లో భాగంగా బవురువాక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ భార్య గౌరి కల్యాణి ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి, అండగా ఉంటాని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, ఎంపీటీసీ అమరాధి కాశీ, రంగనాథం అబ్బాయి ఉన్నారు.

ఉన్నతి బకాయిలను చెల్లించాలి



సోలార్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసురావు

ప్రత్తిపాడు: ఉన్నతి పథకం బకాయిల వసూలును వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు వెలుగు సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం ఆయన ప్రత్తిపాడు వచ్చారు. ఉన్నతి పథకం భాగంగా ఎస్సీ, ఎస్టీ రుణాలు పొందిన లబ్ధిదారులు రుణాల చెల్లింపు పూర్తిగా మందగించడంతో, 2014 నుంచి ఇప్పటి వరకు ఉన్న బకాయిల వసూలు నిమిత్తం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన పలువురు లబ్ధిదారులను కలిసి రుణాలను త్వరగా చెల్లించాలని ఆదేశించారు. ఆయన వెంట వీపీఎం కేశవ, ఏపీఎం గిడిజాల శ్రీనివాసరావు, సీసీలు వెంకట్, శ్రీనివాసరావు తదితరులున్నారు. అనంతరం ప్రత్తిపాడులో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టమ్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో అన్నసమారాధనలు

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రులు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ధర్మవరం బొమ్మల రామాలయం వద్ద గణపతి మండలం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు భారీ ఎత్తన తరలివచ్చిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

యువతా మేలుకో..ఓటు నమోదు చేసుకో



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని 18-19 ఏళ్ల కలిగిన యువతి, యువకులంతా తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఎ.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గ్రామాల్లో ఓటు హక్కు లేని యువతను గుర్తించి, ఓటరు జాబితాలో నమోదయ్యేలా ఎన్నికల సిబ్బందికి సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులను ఆయన కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సూపర్‌వైజర్లతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని శిధిలాస్థితిలో ఉన్న పోలింగ్ కేంద్రాల భవనాలను మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం తహసీల్దార్లు ఎం సూర్యప్రభ, తాతారావు, నరేష్, ఆనందరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీను (టీడీపీ), ఎం వీరబాబు (జనసేన)లతో పాటు ఎన్నికల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అవినీతిమయం



తిరుమాలిలో పర్యటిస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీశ్రేణులు

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం అవినీతిమయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని తిరుమాలి గ్రామంలో గురువారం బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ గ్రామస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి బీ.ఆర్ అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు మోసాలను వివరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అర్హులందరికి సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందించామన్నారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు అమలు సక్రమంగా జరగడం లేదని, మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. గ్రామాగ్రామన పార్టీని బలోపేతం చేయాలని, పార్టీశ్రేణులకు అండగా తాను ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, మహిళా విభాగం మండల కన్వీనర్ బులిపేదేవి, మండల కోఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, బెహరా దొరబాబు, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, ఓలేటి చంటి, కోరుకొండ రామకృష్ణ, పసల రాంబాబు, అన్నిగ్రామాల పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

ఏలేశ్వరం: స్వచ్ఛత పక్వాడాలో భాగంగా స్థానిక సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులకు స్వచ్ఛతపై గురువారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ చంద్రశారద మాట్లాడుతూ విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడం, నీటిపొదుపు, వర్షపునీటి సంరక్షణపై వంటి పలు అంశాలపై అవగాహన కలిగించామన్నారు. బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, శుభ్రమైన నీరు, సబ్బు తదితర వసతులపై చర్యలు చేపట్టామన్నారు. అనంతరం విద్యార్థులతో పట్టణంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఏలేశ్వరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రత్తిపాడు సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని జెఅన్నవరం గ్రామంలో గురువారం పౌష్టికాహర మాసోత్సవాల్లో భాగంగా సుపోషిత భారత్ సక్షం భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం వచ్చే 16 తేదీవరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీఓ టీబీఆర్ పద్మావతి చెప్పారు. మండలంలోని టి రాయవరం, పి. జగన్నాధపురం గ్రామాల్లో గురువారం పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. టి.రాయవరం గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఉప సర్పంచ్ జి వీరబాబు, సూపర్‌వైజర్ ఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

గోకవరం: భవిష్యత్తు మార్గనిర్దేశకులుగా ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరి జీవితంలో ఉన్నత స్థానం పోషిస్తారని గోకవరం మండల యూటీఎఫ్ సభ్యులు అన్నారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులను గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక సూర్యఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మల్లవరం డీపీపీఆర్ఏయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాళ్ల అబ్రహంపాల్‌తో పాటు ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎమ్ఎస్.రత్నరాజు, జి.రాంబాబు, డి.సుబ్రహ్మణ్యం, జెస్సీ జానే, అలాగే వివిధ సంస్థల ద్వారా ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులు ఎం.సుధాలక్ష్మి, సిహెచ్ వి.కృష్ణంరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, పెదిరెడ్ల రాజులను యూటీఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు.

చిరు ధాన్యాల సాగు ఉత్తమం

కిర్లంపూడి: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించడం ద్వారా అధిక లాభాలను ఆర్జించే అవకాశం ఉందని ఎఫ్‌టీసీ ఏడీఏ మాలకొండయ్య రైతులకు సూచించారు. మండలంలోని సింహాద్రిపురంలో ఏఓ సుధామాధురి అధ్యక్షతన చిరుధాన్యాల సాగుపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిరుధాన్యాల సాగు విధానం సూచనలు, సలహాలు అందజేశారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఫ్‌టీసీ ఏఓ సంజయ్, ఏడీఏ దైవకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కందా వెంకన్న, ఏఈఓ, వీఏఏలు ఉన్నారు.

తోట నరసింహం పరామర్శ



సుంకర వెంకటరమణను పరామర్శిస్తున్న తోట నరసింహం, శ్రీరాంజీలు

గోకవరం: మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వెంకటరమణను మాజీ మంత్రి, పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం గురువారం పరామర్శించారు. వెంకటరమణ ఇటీవల రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తోట నరసింహం, ఆయన తనయుడు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీలు బొల్లినేని ఆస్పత్రిలో ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన కుమారుడు, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబుకి ధైర్యం చెప్పారు. వారి వెంట నాయకులు సమ్మెటి నాని, తోలేటి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ముద్రగడ గిరిబాబును కలిసిన నాయకులు



ముద్రగడ పద్మనాభంతో పార్టీ మండల నాయకులు

కిర్లంపూడి: శంఖవరం జడ్పీటీసీ ఈగల అప్పారావు, ప్రత్తిపాడు, శంఖవరం మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ముద్రగడ పద్మనాభంను, ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారిని గిరిబాబు సూచించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ కొరుప్రోలు దేవుడు, రామిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



పోతులూరులో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణం రాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు, బవురువాక, శరభవరం, ధర్మవరం గ్రామాల్లో గురువారం పలు బాధిత కుటుంబాను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పోతులూరు గ్రామానికి చెందిన ముప్పిడి ఏసు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొట్టుమూరి నాగు కుమారుడు కార్తీక్ భవనం పై నుంచి పడటంతో రెండు కాళ్లకు గాయాలవ్వగా పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బవురువాకలో సతీవియోగంతో బాధపడుతున్న గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణను పరామర్శించారు. ధర్మవరంలో దొడ్డిపట్ల భూషణం తల్లి చల్లయ్యమ్మ, పలివెల గంగారావు భార్య జలారత్నం మృతి చెందారు. శరభవరంలో యడ్ల భాస్కరరావు మృతి చెందారు. ఆయా బాధిత కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి వద్ద జగ్గంపేట–పెద్దాపురం ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా ఈ నెల 20 వ తేది శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ బి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాట్రావులపల్లి, సూరంపాలెం, గ్రామాలకు, సరఫరా ఆగిపోతుందని, వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు



వీఆర్‌ఏలకు మద్దతు తెలుపుతున్న తహసీల్దార్ సూర్యప్రభ

తొండంగి: దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మండలంలోని రెవెన్యూ వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు వీఆర్ఏలు మాట్లాడుతూ సర్వీసును పరిగణలోకి తీసుకుని అర్హత ఆధారంగా వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సరైన జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులుపడుతున్నామని పేస్కేలు అమలు చేయాలన్నారు. మండలపరిధిలోని రెవెన్యూ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కోటనందూరు: వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలంతా గురువారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ తాతారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వీఆర్ఏలుగా పనిచేస్తున్న తమకు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నేతల పైడిరాజు, మేడికొండ జోగిరాజు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన తహసీల్దార్

ప్రత్తిపాడు: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు అంబేడ్కర్ కళామందిర్ వద్ద గురువారం గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) ధర్నా చేపట్టారు. మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు కొమరగిరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వీఆర్ఏలు మాట్లాడుతూ పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, కార్యాలయ సిబ్బంది ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

గండేపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలంటూ గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. వీఆర్ఏలకు పేస్కేల్, ప్రమోషన్స్, నామినీలకు వీఆర్ఏలుగా పోస్టింగ్స్ ఇవ్వాలంటూ ప్లకార్డ్స్ చేతపట్టుకుని నినాదాలు చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ధర్నాలో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ నెల 20వ తేదీన పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం, 22న కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన తెలియజేస్తామన్నారు.

వీఆర్ఏలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

గోకవరం: వీఆర్ఏల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గోకవరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్ఏలు గురువారం సమ్మె నిర్వహించారు. రూ.26 వేలు వేతనం చెల్లించాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జగ్గంపేట: విఆర్ఏలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణం పరిష్కారించాలని కోరుతూ జగ్గంపేట తాహసీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఏలు గురువారం ఆందోళన చేపట్టారు. తమ సమస్యలు పట్ల ప్రభుత్వం స్పందించాలన్నారు. లేని పక్షంలో విడతల వారీగా డివిజన్, జిల్లా స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

జగన్‌ను కలిసిన మాజీ మంత్రి తోట



తాడేపల్లిలో జగన్ కలిసిన తోట నరసింహం, నియోజకవర్గ నేతలు

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తోట నరసింహం, ఆయన తనయుడు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించినట్లు చెప్పారు. యల్లమిల్లికి చెందిన పార్టీ నేత మలిరెడ్డి పాపారావు గ్రామానికి చెందిన అమ్మవారి చిత్రపటాన్ని వైఎస్ జగన్‌కు అందచేశారు. జగన్ కలిసిన వారిలో జగ్గంపేట మండలానికి చెందిన పార్టీ వాలంటరీ విభాగం అధ్యక్షుడు శరకణం అచ్చిరాజు, టౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, తోట రాజా తదితరులు ఉన్నారు.

మ్యాజిక్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ మేనేజర్ బి.విజయ్ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట ఏఓ కె.చంద్రరావు, ఏపీఓ ఎం .రామకృష్ణంరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి జి.శ్వేత, ఈసీ రమేష్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది ఉన్నారు.

మోతాదులోనే ఎరువులు వాడాలి

శంఖవరం: వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకు మోతాదులోనే ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మండలంలోని నెల్లిపూడి, కొంతంగి గ్రామాల్లో గురువారం ×పొలంబడి పిలుస్తుంది× కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల వినియోగం అధికమైతే నష్టం జరుగుతుందన్నారు. భూమి నాణ్యత క్షీణిస్తుందన్నారు. సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మణికంఠ, రాజు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పచ్చి రొట్టతో భూమి సారవంతం

గోకవరం: మండలంలోని వెదురుపాక గ్రామంలో భూసార పరీక్షా ఫలితాలు, సమగ్ర పోషక యాజమాన్యంపై గురువారం రైతులకు ఏఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు శిక్షణా వ్యవసాయ సంచాలకురాలు జయరామలక్ష్మీ, కోరుకొండ ఏడీఏ శశిబిందు పాల్గొని ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. యూరియా, సూపర్ పొటాష్ కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, స్థానిక నాయకుడు పిల్లా చంటిబాబు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిభావంతో పారాయణం

ఏలేశ్వరం: ద్వాదశి తిదిని పురస్కరించుకుని పట్టణంలో గురువారం మహిళలు పలుపారాయణలు చేశారు. విశ్వహిందూపరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాలచే స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని గుడివద్ద పలు పారాయణాలు చేశారు. మహిళలు భగవద్గీత, హనుమాన్‌చాలీ సా, గణపతి స్తోత్రాలు పఠించారు.పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు కటకం కిరీటి, గిరిజ, జ్యోతి పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గోకవరం: దసమి ఉత్సవాలను పురస్కరించుకుని కొత్తపల్లికి చెందిన పిల్లల విజయ్‌కుమార్, కోరుకొండకు చెందిన సూరాడి వీరబాబులు గురువారం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తుండగా విద్యుతాఘాతానికి గురై ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రధమ చికిత్స అందించి మెరుగైన ఆరోగ్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.